ఆకుమడులకు ఊపిరి...


వర్షాలకు పచ్చగా తయారైన వరినారు


పది రోజుల క్రితం ఎండిపోయిన స్థితిలో వరినారు(ఫైల్)

- అడపాదడపా కురుస్తున్న వర్షాలు
- పది రోజుల్లో మారిన వాతావరణం
- ఖరీఫ్ రైతుల్లో చిగురించిన ఆశలు

రోలుగుంట : తుఫాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు వరినారు మడులకు ఊపిరిపోసాయి. పది రోజుల క్రితం ఈ ఖరీఫ్ సాగు కోసం రైతులు పోసుకున్న ఆకుమడులు ప్రారంభంలో పచ్చగానే ఉన్నా, తరువాత కాసిన ఎండలకు ఆకుమడులు ఎండిపోయాయి. రైతులు ఆశలు వదులుకున్న తరుణంలో తుఫాను ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆకు మడులకు మేలు చేశాయి. నారుమడులు పచ్చగా ఉన్నాయి. పదిరోజుల్లో ఆకుమడుల ముఖచిత్రం మారిపోయింది. కురుస్తున్న వర్షాలపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో దోమల నియంత్రణ చర్యలు

రోలుగుంట : గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు దోమల నియంత్రణ చర్యలు **చేపట్టారు.** దీనిలో భాగంగా స్థానిక పంచాయితీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ డ్రై డే శుక్రవారం గ్రామ వీధుల్లో సిబ్బందితో సైపెర్మోత్రిన్ అయిదు శాతం సిబ్బందితో గ్రామ వీదిల్లో కాలువల్లోను, గృహాల ఆవరణలో మురుగు పరిసరాలు గుర్తించి పిచికారి చేయించారు. గృహ యజమానులకు పారిశుధ్య సూచనలు చేశారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వేలు


రుబ్బురోలులో నీటిని పైకి తోడుతున్న ఆశ, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు

మాడుగుల రూరల్ : ఫ్రైడే డ్రైడేను పురస్కరించుకొని, గ్రామాల్లో శుక్రవారం దోమలు నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. రుబ్బురోళ్లు, నీటి కుండీల్లో నీరు నిల్వ ఉండడం వల్ల మలేరియా, డెంగ్యూ, వంటి వ్యాధులు ప్రబలుతాయని పంచాయతీ కార్యదర్శులు, ప్రజలుకు అవగాహన కల్పించారు. అలాగే ఫీవర్ సర్వే చేపట్టారు. మేజర్ గ్రామ పంచాయతీ కె.జె.పురంలో సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ కార్యదర్శి బి. నవీన్‌దోర సారథ్యంలో ఇంటింటికి వెళ్లి దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశ, కార్యకర్తలు, పాల్గొన్నారు. మండలంలో మిగిలిన 28 గ్రామ పంచాయతీల్లో ఫీవర్ సర్వే, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు.

నూతన ఎస్‌ఐకు ఎంపీపీ, జెడ్పీటీసీ సత్కారం


నూతన ఎస్‌ఐ సత్యనారాయణను సత్కరిస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం

దేవరాపల్లి : ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన దేవరాపల్లి ఎస్‌ఐ వి.సత్యనారాయణను స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి , జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీలు పంచాడ సింహాచలంనాయుడు, ఉగ్రాకుల గంగాభవానీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు తదితరులు కలిశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి ఎస్‌ఐను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్‌ఐను కలిసిన వారిలో సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, గూడెపు రాము, గొర్రుపోటు సుధారాణి, గంధం రామకృష్ణ ఉన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి


నిల్వ నీటిని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి

నర్సీపట్నం : ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి వైద్య సిబ్బందికి సూచించారు. మాకవరపాలెం మండలం, చినరాచపల్లిలో జరుగుతున్న ఇంటింటి సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించేలా ప్రజల్లో చైతన్య తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులతో పాటు దోమల ద్వారా సోకే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె వెంట సీహెచ్‌వో రమేష్, సిబ్బంది ఉన్నారు.

వాడవాడలా డ్రై డే కార్యక్రమాలు

మాడుగుల : ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలో శుక్రవారం మాడుగుల, తాటిపర్తి తదితర గ్రామాల్లో ఏఎన్‌ఎంలతో పాటు ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారానికి ఒకసారి తాగునీటి పాత్రలు పొడిగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆశా, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రైతు సంఘ సర్వసభ్య సమావేశం రేపు

మునగపాక: మునగపాక రైతు సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం జరగనుందని సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక బైపాస్ రోడ్డులోని రాహుల్‌గాంధీ కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని, నూతన కార్యవర్గం ఎన్నిక కూడా నిర్వహిస్తామని పేర్కొన్నా రు. మునగపాక పంచాయతీ పరిధిలోని మూల సంఘాల రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు


కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయం వద్ద భక్తుల పూజలు


ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు

మాడుగుల రూరల్ : శ్రావణ మాసంలో వచ్చు తొలి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని, కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాతకు పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజాది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులకు వేమలవలసకు చెందిన సతీష్, ఘాట్‌రోడ్డుకు చెందిన వెంకటరమణ సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. భక్తులకు వేగి రాము ఉచిత ఆటో సహకారంతో గ్రామం నుంచి ఆలయానికి చేరవేశారు. శ్రావణ మాసం పురస్కరించుని అమ్మవారి మాలాధారణ కార్యక్రమం వచ్చే నెల 2 వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు అమ్మతల్లినాయుడు తెలిపారు. ప్రధాన అర్చకులు దొంతుకుర్తి శ్రీనివాసశర్మ సారథ్యంలో పూజలు, గోమాతకు పూజలు నిర్వహించారు.

తుపాను ప్రభావంతో చేవల వేటకు ఇబ్బందులు


తాండవ జలాశయంలో చేపల వేట చేస్తున్న జాలర్లు

గొలుగొండ : తుపాను ప్రభావంతో తాండవ జలాశయంలో జాలర్లకు చేపలు పట్టడం కష్టంగా మారింది. వారం రోజుల నుంచి చేపల వేటకు వెళుతున్న సమయంలో జలాశయంలో ఈదురు గాలుల వల్ల వేట సాగడం లేదని జాలర్లు ఆవేదన చెందుతున్నారు. చేపలు, రొయ్యలు పట్టడానికి జలాశయంకు వెళుతుంటే కనీసం కూలి డబ్బులు కూడా రావడం లేదని అంటున్నారు. సుమారుగా 300 మంది వరకు జాలర్లు ప్రతి రోజు జలాశయంలోనికి వేటకు వెళుతుంటారు. వర్షం పూర్తి స్థాయిలో లేకపోయినా గాలుల కారణంగా వేట చేయలేకపోతున్నామని తెలిపారు.

గిరిజన గ్రామాల్లో సత్యసాయి భక్తుల వితరణ


విద్యార్థులకు గొడుగులు, విద్యాసామాగ్రిని అందజేస్తున్న సత్యసాయి భక్తులు

దేవరాపల్లి: మండలంలోని పాతవాలాబు, కొత్తవాలాబు, రేగులబంద, బుచ్చెంపాలెం గ్రామాలలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. సత్య సేవా సంస్థ ట్రస్ట్ రావాడ శశిభూషణ్‌రావు ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు విద్యా సామాగ్రి, గొడుగులను, విద్యార్థినులకు కాస్మటిక్ సామాగ్రిని వితరణగా అందజేశారు. ఇంచార్జ్ ఎంఈవో-1 సిహెచ్. ఉమ, సత్య సేవా సంస్థల మండల కన్వీనర్ ఆదిరెడ్డి చినకన్నబాబు చేతుల మీదుగా వాటిని అందజేశారు. అలాగే ఆయా గ్రామాలలో మహిళలకు చీరలు, పురుషులకు లుంగీ, తువ్వాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు వి.రమామణి, సిహెచ్. జగన్నాథం, వి.లలితా ప్రసాద్, కె.పెంటారావు, ప్రధానోపాధ్యాయుడు కె.దండెంనాయుడు, ఉపాధ్యాయులు సన్యాసినాయుడు, చిరికి సింహాచలం నాయుడు, కొల్లి శ్రీను, కొట్టాన రాంబాబు పాల్గొన్నారు.

డెంగ్యూ పట్ల అప్రమత్తత అవసరం


మాడుగులలో డెంగ్యూ నివారణపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజల అప్రమత్తంగా వుండాలని కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్.వి.ఎస్.వి. ప్రసాదుపాత్రుడు పేర్కొన్నారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా మాడుగుల సచివాలయం- 1 పరిధిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పాత్రుడు మాట్లాడుతూ అధిక జ్వరం, తలనొప్పి, కళ్ల నొప్పి, కండరాలు కీళ్ల నొప్పులు దద్దుర్లు, వాంతులు, వికారం వంటివి డెంగ్యూ లక్షణాలు అన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటావు మాట్లాడుతూ ఇంటి చుట్టు నీరు నిల్వ వుండే ప్రదేశాలను తొలగించాలని, పూలకుండీలు, పాతటైర్లు, ఖాళీ డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, ఆశ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి తీరువా బకాయిలు రూ.5 కోట్లు


తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం : మండలంలో నీటి తీరువా పన్నులు వసూలు రూ.5 కోట్లుకు పైగా వసూలు చేయాల్సిందని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు నుంచి నీటి తీరువా పన్నులు వసూలు యుద్ధప్రతిపదికన వసూలు చేయాలని కలెక్టరు నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా ఇంతవరకు రైతులు నుంచి కేవలం రూ.15 లక్షలు మాత్రమే పన్నులు వసూలు చేశామన్నారు. తర్వాత అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి మండలంలో 1348 మంది రైతులు ఉన్నారన్నారు. వాటిలో 449 మంది మరణించారన్నారు. వాటిని ఆయా కుటుంబాలు సభ్యుల పేర్లు మీద మార్పు చేయాల్సిందన్నారు. 200 మంది రైతులు ఆధార్ నెంబర్లు సీడింగ్ చేసుకోవాలన్నారు. మరో 150 మంది రైతులు వివిధ కారణాల కారణంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈవిధంగా రైతులు దరఖాస్తులు చేసుకుని ఆన్‌లైన్‌లో సరిచేసుకోవాలన్నారు.

ఆనకట్ట గేట్లు మరమ్మతులు చేపట్టాలి


ఆనకట్ట గేట్ల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నీటి సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు

కొంకోట: మండలంలోని ఏఎస్‌పేట గ్రామం వద్ద శారదానదిపై నరసాపురం ఆనకట్ట గేట్లు, మోటార్లకు మరమ్మతులు చేపట్టాలని ఆనకట్ట నీటి సంఘం అధ్యక్షుడు ఉప్పులూరి అప్పలనాయుడు ఆ శాఖ అధికారులను కోరారు. శుక్రవారం ఆనకట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనకట్ట గేట్లు సరిగ్గా పని చేయడం లేదని, దీనివల్ల నదిలో నీటిమట్టం పెరిగితే ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీని దృష్ట్యా గేట్లకు మరమ్మతులు చేపట్టాలని, వీటిని పైకి ఎత్తడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను సత్వరమే వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

కొత్తకోటలో ఉచిత వైద్య శిబిరం


కొత్తకోట హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న కొత్తకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

రావికమతం : కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి మోహిని సురేఖ ఆధ్వర్యంలో కొత్తకోట హాస్టల్‌లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 82 విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. వీరిలో జర్వాలు ఉన్న ముగ్గురికి రక్త పరీక్షలు చేశారు. నెగెటివ్ వచ్చిందని వైద్యాధికారి తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్ వాష్ ఎలా చేసుకోవాలో తదితర విషయాలపై అవగాహన కల్పించారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున్న రోగాలు వచ్చే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ వేడి నీళ్లు తాగాలని వారు సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెల్త్ ఎడ్యుకేటర్ రమణమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం


జి.కోటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి

అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ప్రతి ఇంటికి బిగిస్తుందని, వీటివల్ల విద్యుత్ బిల్లులు పెరగవని ఆ శాఖ అధికారులతో తప్పుడు ప్రచారం చేయిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా ఆ శాఖాధికారులు మోసం చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే అప్పటి యువగళం పాదయాత్రలో నారా లోకేష్ సభలు నిర్వహించారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలు కొట్టాలని చెప్పిన ఆయన తాము అధికారంలోకి వస్తే వాటిని తొలగిస్తామని అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికే చార్జీలు పెంచి వినియోగదారులపై మోయలేని భారం వేసిందన్నారు. స్మార్ట్ మీటర్ వల్ల అనేక ప్రాంతాల్లో విద్యుత్ బిల్లులు భారీగా పెరిగినట్లు వాపోయారు. దీనిపై విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ అంగీకరించారన్నారు. స్మార్ట్ మీటరు అంటే ప్రీపెయిడ్ మీటర్ అని ముందుగానే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పగలు ఒకరేటు, రాత్రి ఒక రేటు విధించి బిల్లు వస్తుందన్నారు. దీని నిర్వహణ అదానీ కంపెనీ చూసుకుంటుందన్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు కొనుగోలుకు అదానీకి చెందిన షిర్డీసాయి ఎలక్ట్రికల్ కంపెనీకి రూ. 25 వేల కోట్లు విద్యుత్ శాఖ అప్పగించిందన్నారు. త్వరలో ఈ భారం ప్రజలపైనే పడుతుందన్నారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలోలో షాపులకు బిగించిన స్మార్ట్ మీటర్‌కు రూ.64 వేలు, వ్యవసాయం మోటార్‌కు రూ.23 వేలు బిల్లు రావడంలో వారు కంగుతిన్నారన్నారు. విద్యుత్ చార్జీల పేరుతో ఏడాదిలో కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్లు భారం మోపిందన్నారు. 2024- 25లో వినియోగదారులపై రూ.850 కోట్ల భారాన్ని ఇప్పటికే మోపిందన్నారు. అబద్ధపు మాటలతో విద్యుత్ శాఖ ఉద్యోగులు ప్రజలను మోసం చేయవద్దని హితవు పలికారు.

విద్యార్థుల రక్తదానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి. స్వాతి మనోజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో 50 యూనిట్లు రక్తం సేకరించామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మురళీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయోత్సవ ర్యాలీ నేడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని కార్గిల్ విజయోత్సవ ర్యాలీని శనివారం నిర్వహించనున్నట్లు అనకాపల్లి సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి మెయిన్‌రోడ్ మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ఈ ర్యాలీ సాగుతుందన్నారు. కార్గిల్ యుద్ధంలో విజయం సాధించిన సందర్భంగా ఏటా జూలై 26న ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. మాజీ సైనికులు, సోషల్ వర్కర్స్, ఎన్‌సీసీ స్టూడెంట్స్‌తో పాటు ప్రజలంతా పాల్గొనాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద క్వారీ బాధితుల నిరసన


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలుపుతున్న క్వారీ బాధితులు


అసలు రైతులం మేమే అంటూ ఏవోకు ఫిర్యాదు చేస్తున్న కొంత మంది వ్యక్తులు

నర్సీపట్నం: జి.కోడూరు క్వారీ అనుమతులు రద్దు చేయాలంటూ ఆర్డీవో కార్యాలయం వద్ద చేస్తున్న నిరాహారదీక్షలో భాగంగా శుక్రవారం అబిడ్‌సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. మూడు రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్నా అధికారులకు పట్టింపు లేదని వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు మట్ల చంటి, బీఎస్పీ నాయకులు బొట్టా నాగరాజు పేర్కొన్నారు. దళిత రైతులకు అన్యాయం చేస్తూ, మైనింగ్ మాఫియాకు అధికారులు కొమ్ము కాయడం సరికాదన్నారు. దళితుల్లో లేని అపోహాలు సృష్టించి ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తున్నారన్నారు. వెంటనే క్వారీని రద్దు చేయాలన్నారు. కొల్లు గంగాధర, అప్పారావు, లావరాజు, పెంటయ్య పాల్గొన్నారు. కాగా మరో వైపు అసలు రైతులం తామేనని, మా ఇష్టపూర్వకంగానే మా భూములను క్వారీకి ఇచ్చామని, మా ఉపాధిని గండి కొట్టేందుకు కొందరు బూటకపు ధర్నా చేస్తున్నారంటూ ఆర్డీవో కార్యాలయం ఏవో సుధాకర్‌కు కొందరు వ్యక్తులు వినతిపత్రం అందజేశారు. ధర్నా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మహాలక్ష్మి, దేముడు, చిన్నదేముడు, లక్ష్మి, కళ్యాణం, బాపూజీ, అప్పారావు ఫిర్యాదులో కోరారు.

దిబ్బిడిలో సామూహిక కలశ పూజలు


వడ్డాదిలో పూజలందుకున్న అమ్మవారు


దిబ్బిడిలో కలశ పూజలో పాల్గొన్న మహిళలు

బుచ్చెయ్యపేట : దిబ్బిడి గ్రామ శివాలయంలో సామూహిక కలశ పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం అవడంతో రామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న దుర్గాదేవి అమ్మవారికి కలశపూజా మహోత్సవం నిర్వహించారు. దిబ్బిడి, బుచ్చెయ్యపేట, నేతవానిపాలెం తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది మహిళలు కలశ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు సహస్ర నామాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసాలు ఉంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న మహాలక్ష్మి (అలివేలు మంగ) అమ్మవారికి శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షా సూత్ర ఆరాధన, విశేష పంచామృత అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం నెల రోజులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని దేవస్థానం అధికారులు, సిబ్బంది తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడంతో పాటు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ కేటుగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మీ ఆధార్‌తో నాలుగు సిమ్‌లు అనుసంధానమై వాటి ద్వారా ఉగ్రవాదులతో మాట్లాడుతున్నావంటూ బెదిరిస్తూ దోచుకుంటారన్నారు. లోన్ బెట్టింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు కెమెరా, లొకేషన్లు, ఫోన్ కాంటాక్ట్స్ ఫొటోలు అనుమతి ఇవ్వడం వల్ల వారికి మన ఫోన్ యాక్సెస్ ఇచ్చేసినట్టేనని తెలిపారు. కొన్ని సందర్భాల్లో యాప్‌లో లోన్ తీసుకుంటే వడ్డీతో సహా చెల్లించినప్పటికీ ఇంకా చెల్లించాలని ఒత్తిడి తెస్తారని, లేదంటే ఫోన్‌లోని ఫొటోలను మార్ఫింగ్ చేసి, బంధువులు, స్నేహితులకు పంపుతామని బెదిరిస్తారన్నారు. ఇలాంటి ఘటనల వల్ల అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా చక్కగా చదువుకుని మంచి ప్రయోజకులై మీ కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజు, ఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.

కొత్తకోటలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న సర్పంచ్, వైస్ సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

రావికమతం : మేజర్ పంచాయతీ కొత్తకోటలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సర్పంచ్ కోన లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా, ఎంపీటీసీ సభ్యులు పూడి దేవ , పంచాయతీ ఈవో జ్యోతిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీ భగవంతరావు కలిసి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. బహిరంగ మల విసర్జనను అరికట్టడానికి స్వచ్ఛత అభియాన్ నిధులతో సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మాణం చేస్తున్నట్టు వారు తెలిపారు. మర్రివలస రూట్‌లో రెండు, కన్నంపేట రూట్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా రెండు యూనిట్లు, మార్కెట్ యార్డ్ వెనుక రెండు యూనిట్లు, మెయిన్‌రోడ్డులో గల బ్రిడ్జికి సమీపంలో రెండు యూనిట్లు ఏర్పాటు చేయడానికి స్థలం అనుకూలంగా ఉందని, త్వరలో సులభ్ కాంప్లెక్స్ పనులు ప్రారంభిస్తామని సర్పంచ్ లోవరాజు, వైస్ సర్పంచ్ లోవరాజు, ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవా తెలిపారు.

అవినీతి తక్కువున్న దేశాలు త్వరగా అభివృద్ధి


మాట్లాడుతున్న రాష్ట్ర సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్

అనకాపల్లి: అవినీతి తక్కువగా ఉన్న దేశాలు త్వరగా అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ తెలిపారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'సమాజ అభివృద్ధి-అవినీతి నియంత్రణ' అంశంపై గురువారం రాత్రి సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ అవినీతి నియంత్రణతో సామాజిక సమానత్వం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పౌర సేవల డిజిటలైజేషన్ అవినీతిని తగ్గిస్తుందన్నారు. అవినీతిని నియంత్రించకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. అవినీతి రహిత వ్యవస్థతో న్యాయం త్వరగా అందుతుందన్నారు. ప్రతి పౌరుడు అవినీతి నిరోధకంగా వ్యవహరించాలని, ప్రజల నిఘా, ఫిర్యాదు వ్యవస్థలు బలోపేతం చేయాలన్నారు. చట్టాలపై ప్రజలకు నమ్మకం పెరిగితే అవినీతి తగ్గుతుందన్నారు. యువతలో నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. ప్రపంచంలో 180 దేశాల అవినీతిలో మన దేశం 93వ స్థానంలో ఉందని, దేశాన్ని పట్టిపీడిస్తోన్న అవినీతిని అంతమొందించేందుకు యువత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ పట్టణ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.